క్లుప్తంగా

9న అన్నదాత పోరు జయప్రదం చేయండి



అన్నదాత పోరు పోస్టర్‌ను చూపిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు రూరల్: ఈ నెల 9వ తేదీన పార్వతీపురంలో జరగనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కోరారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి అన్నదాత పోరు పోస్టర్‌ను చూపిస్తూ రైతులకు ఎరువుల కొరతపై ఆర్‌డీఓ కార్యాలయంలో ఆర్‌డీఓను ప్రశ్నించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

వర్మీకంపోస్టు ఉత్పత్తి కేంద్రం పరిశీలన

సీతానగరం: మండలంలోని ఎస్‌డబ్ల్యూపీసీల్లో వర్మీకంపోస్టు ఎరువు ఉత్పతి సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు పెదభోగిలి మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.తేరేజమ్మ, కార్యదర్శి ఆధ్వర్యంలో వర్మీకంపోస్టు ఉత్పత్తి కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీల్లో తయారుచేస్తున్న వర్మీకంపోస్టుకు గిరాకీ ఉన్నందున నిర్వాహకులు, క్లాప్ మిత్రలు సమన్వయంతో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని, దీంతో పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూరనున్నట్లు తెలియజేశారు. క్లాప్ మిత్రలకు ఎరువు తయారీపై అవగాహన కల్పించనున్నామన్నారు.

ఇళ్లు మంజూరు చేయండి



ఇటీవల కూలిపోయిన ఇంటిని చూపిస్తున్న గదబవలస గ్రామస్తులు

పార్వతీపురం రూరల్: మండలంలోని జమదాల పంచాయతీ పొట్టిగదబవలస గ్రామంలో 15 కుటుంబాల గిరిజనుల ఇళ్లు శిథిలావస్థకు చేరి కూలిపోయే దశలో ఉన్నాయని గడిచిన 15 నెలలుగా సంబంధిత అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో సమస్యను విన్నవించారు. పెంకుటిళ్లు, పూరిపాకల్లో మట్టి గోడలతో నివసిస్తున్న తాము వర్షాలు కురిసినప్పుడు, ఈదురు గాలులు వీచినప్పుడు ఏమవుతుందోనని ఆందోళన చెందుతున్నామన్నారు. కొంతమంది పూర్తిగా ఇల్లు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకుడు పి.రాము మాట్లాడుతూ పొట్టిగదబవలసలో ఎస్టీ గదబ కులానికి చెందిన గిరిజనులు ఇళ్లు సక్రమంగా లేక అనేక అవస్థలు పడుతున్నారని, ఇళ్ల నిర్మాణాలపై అనేక హామీలిచ్చి ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభుత్వం అమాయకపు గిరిజనులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించాలని కోరారు.

బాలల హక్కులు కాపాడుకోవాలి

- ఎంపీపీ ప్రమీల పిలుపు



మాట్లాడుతున్న ఎంపీపీ బి.ప్రమీల

పాచిపెంట: బాలల హక్కులు పాడుకోవాలని, బాల్యవివాహా లకు దూరంగా ఉండాలని ఎంపీపీ బి. ప్రమీల పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆమె పాచిపెంట మండల పరిషత్ కార్యాలయ వద్ద మండల స్థాయి కమిటీ సభ్యులు, గ్రామ స్థాయి బాలల రక్షణ, సంక్షేమ కమిటీ సభ్యులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ ద్వారా చైతన్యవంతులై బాలల సంరక్షణకు తోడ్పాటు అందించాలని కోరారు. ముఖ్యంగా బాల్యవివాహాలపై ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బీబీజే పాత్రో, ఐసీడీఎస్ పీఓ బొత్స అనంతలక్ష్మి, మన్యం జిల్లా బాలల సంరక్షణ విభాగం-లీగల్ ప్రొబేషన్ ఆఫీసర్ పి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

షాక్ కొట్టిందంటే పరలోకానికే..!

- విద్యుత్ మోటార్లతో అప్రమత్తం
- నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణానికే ముప్పు



పంట పొలంలో ఉన్న విద్యుత్ మోటార్ కనెక్షన్

బలిజిపేట: వర్షాకాలంలో పంటపొలాల్లో ఉండే విద్యుత్ మోటార్ల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. అప్రమత్తంగా లేకపోతే ఎటువంటి ప్రమాదం అయినా సంభవించే అవకాశాలున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో రైతులు వారి పొలాల్లో వివిధ రకాల పంటలు సాగుచేస్తున్నారు. పంటలకు నీరు పెట్టడం కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ తీగలు, మోటార్ల వద్ద ఎక్కువగా పనిచేస్తుంటారు. చిన్న చిన్న విద్యుత్ సమస్యలు ఉంటే వాటికి మరమ్మతులు చేస్తుంటారు. ఇలాంటి సమయంలో జాగ్రత్తలు చేపట్టకపోతే మృత్యువాత పడే ప్రమాదముంది. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులు రైతులకు సూచనలు అందిస్తున్నారు.

స్టార్టర్లతో జాగ్రత్త

స్టార్టర్ డబ్బాలను మోటార్ పక్కనే పొలంలో ఉంచి కవర్లు కప్పుతుంటారు. ఇది ప్రమాదాలకు తావిచ్చే అవకాశం ఉంది. వర్షం కురిసినా, బోరు నీరు ఎగజిమ్మినా డబ్బాల్లోకి నీరు చేరుతుంది. తీగలు కూడా గజిబిజిగా ఉండేలా తెంపి మళ్లీ అతికిస్తారు. ఏ తీగ ఏ ఫ్యూజుదో తెలియకుండా ఉంటుంది. నేరుగా స్టార్టర్‌కు విద్యుత్ సరఫరా అయ్యేలా ఫ్యూజు అమర్చుకోవాలి. స్టార్టర్ డబ్బులకు తలుపులు తప్పనిసరిగా ఉండాలి. చాలామంది రైతులు ఇప్పటికీ స్టార్టర్ల కోసం ఇనుప డబ్బాలను ఉపయోగిస్తారు. ఇనుపడబ్బాల్లో స్టార్టరు, ఫ్యూజులు బిగియడంతో ఎలుకలు డబ్బాలో చేరి తీగలు కొరకడంతో ఆ తీగలు తెగి, డబ్బాకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఇది తెలియక రైతులు డబ్బాను పట్టుకోగానే షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.

విద్యుత్ తీగలతో ప్రమాదం

గాలివానకు ఒక్కోసారి పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడుతూ ఉంటాయి. ఆ సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. విద్యుత్ స్తంభాలు దూరంగా ఉన్న పొలాల్లో కొంతమంది కర్రల సహాయంతో విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసుకుంటారు. ఇవి వర్షానికి, గాలికి కిందపడుతుంటాయి. వాటిని గమనించకుండా పొలాల్లోకి వెళ్తే కాళ్లకు తగిలి విద్యుత్ షాక్ కొట్టే ప్రమాదం ఉంది. విద్యుత్ అధికారులతో మాట్లాడి స్తంభాలను ఏర్పాటు చేయించుకోవాలి.

జాగ్రత్తలు:

- పొలాల్లో మోటార్లు పనిచేయకపోతే చేతితో పట్టుకోకూడదు
- టెస్టర్ సహాయంతో మాత్రమే పరీక్షించాలి
- వర్షపు నీరు, తేమ తగలని చోట వాటిని అమర్చాలి
- ఎర్తింగ్ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి
- విద్యుత్ మోటార్‌లో అంతరాయం ఏర్పడితే ముందు విద్యుత్ సరఫరా నిలిపివేయాలి
- ఫ్యూజులు పోతే విద్యుత్ శాఖ అధికారుల సహాయంతో వాటి మరమ్మతులు చేయించుకోవాలి

అవగాహన అవసరం

రైతులకు పంటపొలాల్లో మోటార్లపై అవగాహన అవసరం. వర్షానికి తడిసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లను తాకరాదు. కరెంటు వైర్లను తాకుతున్న చెట్లను ముట్టుకోవద్దు. పొలాల్లో స్టార్టర్లు మరమ్మతులకు గురైతే ఎలక్ట్రీషియన్‌తో బాగు చేయించుకోవాలి. పొలాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడితే విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేయించుకోవాలి.

– సింహాచలం, ఏఈ, బలిజిపేట

ఘనంగా వినాయక నిమజ్జనం



అన్నసమారాధన చేస్తున్న ఉత్సవకమిటీ సభ్యులు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో వినాయక నవరాత్రులను పురస్కరించుకుని అన్న సంతర్పణ కార్యక్రమాలు, గణనాథుని నిమజ్జన ఉత్సవాలు శనివారం జరిగాయి.ఈ మేరకు గూడెం వీధి వినాయక ఉత్సవకమిటీ సభ్యుల పర్యవేక్షణలో 6 గ్రామాలకు చెందిన 4 వేలమందికి అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. ఉత్సవ కమిటీ సభ్యులు ఊరూరా గ్రామాల పెద్దలకు శుక్రవారం సాయంత్రం అన్నసమారాధన కార్యక్రమానికి అతిథులుగా హాజరు కావాలని కోరడంతో వేలాది మంది ప్రాజలు పాల్గొన్నారు.

అన్న సమారాధన చేస్తున్న గూడెం ఉత్సవ కమిటీ సభ్యులకు సుంకరి వీధి, వెలమవీధి, పెద భోగిలి, కుమ్మరివీధి యువకులు సంపూర్ణ సహకారం అందించారు. వారందరి సహకారంతో మహిళలు, పురుషులకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేసి 4 వేలమందికి చేసిన అన్నసమారాధన కార్యక్రమం విజయవంతమైందని నిర్వాహకులు తెలియజేశారు. అనంతరం గూడెం వీధినుంచి మార్కెట్‌మీదుగా వెలమవారివీధి, కాలనీమీదుగా సువర్ణముఖి నదిలో శివాలయం రేవులో భక్తులు మేళతాళాలు, బాజాభజంత్రీలతో వినాయక నిమజ్జన కార్యక్రమం చేశారు.

ఎరువు పాట్లు

- మనగ్రోమోర్ షాపువద్ద క్యూకట్టిన రైతులు



టోకెన్లు ఇచ్చిన రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలో ఎరువులు వేయడానికి వాతావరణం అనుకూలించడంతో రైతులు ఎరువుల కోసం ఎదురు చూస్తున్నారు. శనివారం మండలకేంద్రంలోని మనగ్రోమోర్ ఎరువుల విక్రయకేంద్రానికి యూరియా వచ్చిందని సమాచారం అందుకున్న రైతులు ఎరువులకోసం వచ్చారు. ఈ మేరకు ఏఓ ఎస్అవినాష్ మాట్లాడుతూ రైతులు ఎక్కువ మంది రావడంతో పోలీసుల సహకారం తీసుకుని యూరియా కోసం ఆధార్, వన్‌బీ పత్రంతో వచ్చిన రైతులందరికీ ఒకబస్తా ఎరువు వంతున ఇవ్వనున్నామన్నారు. ఎరువుల పంపిణీ సమయంలో దొమ్మీజరగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా టోకెన్లు ఇచ్చినట్లు తెలియజేశారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తాజాగా మండలంలోని కోటసీతారాంపురం, ఇప్పలవలస, దయానిధిపురం రైతు సేవాకేంద్రాలవద్ద లారీలతో వచ్చిన ఎరువులు అన్‌లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ సిబ్బంది పీఏసీఎస్ సీఈఓలు పాల్గొన్నారు.

కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

పార్వతీపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పురపాలక సంఘాలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్లందర్నీ పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సింహాచలం అధ్యక్షతన శనివారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ వెంటనే ప్రకటించాలని పెరిగిపోయిన నిత్యావసరాల ధరలు కార్మిక వర్గాన్ని తీవ్ర ఇబ్బంది పెడుతున్నాయని, కార్మికుల వేతనాలు పెంచాల డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పని ప్రైవేటీకరణ, వర్క్ ఔట్‌సోర్సింగ్ విధానాలు వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నాగవంశం శంకర్రావు, వరదరాజు, శివ, రాజేష్, సీఐటీయూ పార్వతీపురం పట్టణ నాయకుడు సూరిబాబు సమావేశంలో పాల్గొన్నారు.

వ్యాధులు గుర్తించేందుకే ఆరోగ్య సర్వేలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు

పార్వతీపురంటౌన్: వ్యాధి లక్షణాలున్న వారిని క్షేత్ర స్థాయిలోనే గుర్తించేందుకు ఆరోగ్య సర్వేలు పక్కాగా నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు వైద్య సిబ్బందికి సూచించారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించిన ఎన్సీడీ4.0 శిక్షణ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ పాల్గొని పలు సూచనలు చేశారు. వ్యాధి ప్రబలక ముందే అనుమానిత లక్షణాలను సత్వరమే గుర్తించి తగు చికిత్స అందించాలని, ఇదే లక్ష్యంగా ఆరోగ్య సర్వేలు చేపట్టాలని పేర్కొన్నారు. తద్వారా చికిత్స మరింత సులభతరమై వ్యాధి తీవ్రత చెందకుండా జాగ్రతపడవచ్చన్నారు. త్వరలో చేపట్టబోయే ఎన్సీడీ 4.0 సర్వేలో దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించాలని, ముఖ్యంగా కేన్సర్ లక్షణాలను సకాలంలో గుర్తించడమే లక్ష్యంగా ఉండాలని స్పష్టం చేశారు. గ్రామీణ, పట్టణ వైద్య సేవలు, గర్భిణుల వివరాలు ఎప్పటికప్పుడు హెచ్ఎమ్ఐఎస్‌లో పొందుపర్చాలని సూచించారు. స్వర్ణాంధ్ర ప్రగతి నివేదికలను నిర్దేశించిన పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. సమావేశంలో ఎన్సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు, ఎపిడమాలజిస్ట్ డా.సూర్య కౌశిక్, డెంటల్ సర్జన్ డా రమ్య, డీపీఓ లీలారాణి, డెమో సన్యాసిరావు, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఆశ నోడల్ అధికారులు, డీఐఓ తాజ్, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎమ్‌లు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో స్ప్రేపై అవగాహన



నారాయణపురంలో డ్రోన్‌తో స్ప్రే చేస్తున్న అధికారులు, సిబ్బంది

బలిజిపేట: నానో యూరియా, డీఏపీలను డ్రోన్‌తో స్ప్రే చేసే విధానంపై మండలంలోని నారాయణపురంలో రైతులకు శనివారం అవగాహన కల్పించారు. మండల వ్యవసాయశాఖ ఏఓ శివగణేష్ ఆధ్వర్యంలో నారాయణపురంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇఫ్కో కంపెనీ వారి సారథ్యంలో నానో యూరియా, డీఏపీలను ఇద్దరు రైతులకు చెందిన భూములలో డ్రోన్‌తో స్ప్రే చేయించారు. ఏఓ శివగణేష్ రైతులతో మాట్లాడుతూ యూరియా వినియోగాన్ని తగ్గించాలని, మోతాదుకు మించి యూరియా వినియోగించడం వల్ల భూసారం తగ్గుతుందని తెలిపారు. అందుకు ప్రత్యామ్నాయంగా డ్రోన్‌తో స్ప్రే చేయించడం వల్ల రైతులకు సమయం, డబ్బు ఆదా అవుతుందని, మందు పొలమంతా స్ప్రే అయి పంటకు మేలు జరుగుతుందన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్వామా పీడీపై చర్యలు తీసుకోవాలి

- సీఐటీయూ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై మన్మథరావు

పార్వతీపురం టౌన్: జిల్లాలో ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు, అవినీతికి పాల్పడుతున్న పీడీ రామచంద్రరావుపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై మన్మథరావు, కార్యదర్శి బీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక సుందరయ్య భవనంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి కూలీల నుంచి ప్రతి వారం వంద రూపాయలు చొప్పున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఇప్పటికే అనేక సందర్భాల్లో ఫిర్యాదులు చేసినప్పటికీ కనీస చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఉపాధి కూలీల మస్టర్ రికార్డులు కూడా ఇవ్వకుండా నెలకు రూ.10 లక్షలు స్వాహా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, కనీసం జాబు కార్డులు కూడా ప్రభుత్వం ముద్రించి ఇవ్వకుండా ప్రైవేట్ షాపుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ లను కొనుక్కోమని చెప్పడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పీడీ అక్రమాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నప్పటికీ జిల్లా అధికారులు చర్యలు చేపట్టకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇప్పటికే ఒకసారి బదిలీ అయినప్పటికీ ఆ బదిలీని అధికారులు ఎలా నిలుపుదల చేశారని ప్రశ్నించారు. తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు చిరుద్యోగులపై రికవరీలు విధించి పీడీ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న పీడీ రామచంద్రరావును తక్షణమే బదిలీ చేయాలని, ఏసీబీతో దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం చేయండి

- జిల్లా ఆస్పత్రి నేత్ర వైద్య నిపుణుడు డా.వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న నేత్ర వైద్య నిపుణుడు డా.వెంకటేష్

పార్వతీపురం టౌన్: నేత్రదానం చేసి చూపు లేని వారికి వెలుగునివ్వండని జిల్లా ఆస్పత్రి నేత్ర వైద్య నిపుణుడు డా. వెంకటేష్ కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా ఆస్పత్రిలోని నేత్ర వైద్య విభాగంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కార్నియల్ అంధత్వంతో చూపు కోల్పోయిన వారికి నేత్ర దాతల నుంచి సేకరించిన కార్నియా మార్పిడి ద్వారా కంటి చూపును ప్రసాదించవచ్చున్నారు. కావున ప్రజలందరూ అవగాహన చేసుకుని నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. వ్యక్తి మరణానంతరం ఆరు గంటల్లోగా నేత్రాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా సెప్టెంబరు 8 వరకు నిర్వహిస్తున్న నేత్రదాన పక్షోత్సవాల్లో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా నేత్రాలను సేకరించేందుకు అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేత్ర వైద్యాధికారి కృష్ణారావు, జిల్లా ఎన్జీఓ అధ్యక్షుడు కిశోర్, శిక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశవర్కర్లుగా మార్చాలి

- ఆశ వర్కర్స్ యూనియన్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

పార్వతీపురం టౌన్: ఆశ వర్కర్లతో సమానంగా పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశ కార్యకర్తలుగా మార్చాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక సుందరయ్య భవనంలో సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడుతూ ఆశ వర్కర్లకు వయోపరిమితి, మెటర్నిటీ లీవ్, గ్రాట్యుటీపై ప్రభుత్వం జీవో విడుదల చేసిందని, మన్యం జిల్లాలో ఇటీవల మరణించిన కె.విద్యావతి మక్కువ పీహెచ్‌సీలో ఎం.శాంతమ్మ మాదలంగి పీహెచ్‌సీ వర్కర్లకు పీఎంజెడ్‌వై ప్రకారం ఇన్సూరెన్స్ చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆశ వర్కర్లు గత 20 ఏళ్లుగా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు 8 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారని వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి భద్రత లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు అందిస్తున్న నాలుగు వేల రూపాయలు దేనికీ సరిపోవని, వారి శ్రమకు చాలీచాలని వేతనంతో ప్రభుత్వం అవమానానికి గురి చేస్తుందని పేర్కొన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా ఆశ వర్కర్ల సంఖ్యను పెంచాలని, సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న తీర్పును కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు వర్తింపచేయాలని అలాగే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు వి.ఇందిరా, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.గౌరీశ్వరి, ఎం.శివాని, జిల్లా కోశాధికారి నిర్మల, యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మాస్త్రం తయారీ



పణుకువలసలో ద్రావణం తయారుచేస్తున్న సిబ్బంది, రైతులు

బలిజిపేట: మండలంలోని పణుకువలసలో ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్ లక్ష్మి ఆధ్వర్యంలో బ్రహ్మాస్త్రం తయారు చేయడంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. ఈ ద్రావణం తయారీకి 30లీటర్ల గోమూత్రం, 3కిలోలు చొప్పున వేప, జామ, సీతాఫలం, బొప్పాయి, జిల్లేడు, విషముష్ఠి(ముసిడిక) ఆకులను తీసుకుని ముక్కలు ముక్కలుగా చేసి గోమూత్రంలో కలపాలన్నారు. దీనిని మూడు నుంచి నాలుగు పొంగులు వచ్చేవరకు మరిగించుకోవాలని తెలిపారు. ఈ బ్రహ్మాస్త్రాన్ని 100లీటర్ల నీటిలో ఐదు లీటర్లు చొప్పున వేసి స్ప్రే చేసినట్లయితే అన్ని రకాల పెద్దపురుగులకు చెక్ పెట్టవచ్చన్నారు. కార్యక్రమంలో తిరిపతిరావు, గంగమ్మ, రైతులు పాల్గొన్నారు.

వెలుగు సిబ్బందిపై కలెక్టర్‌కు ఫిర్యాదు



మాట్లాడుతున్న డ్వాక్రా మహిళా సంఘం సభ్యులు

పాచిపెంట: మహిళలకు బ్యాంకు లింక్ రుణాలు చెల్లించే విషయంలో రాజకీయ జోక్యం తగదని మండలంలోని మోసూరు గ్రామానికి చెందిన శ్రీ వరలక్ష్మి మహిళా గ్రూప్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం గ్రామంలో మహిళా సంఘం సభ్యులు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా సంఘాన్ని విజయవంతంగా నడుపుకుంటున్నామని బ్యాంకురుణాలు తీసుకున్నా నిబంధనల మేరకు ఎప్పటికప్పుడు తిరిగి కడుతున్నామని చెప్పారు. ఇటీవల బ్యాంకు లింకేజీ రుణాల కోసం సంఘం తీర్మానం చేసుకుని వెలుగు సిబ్బందికి సమర్పించామన్నారు. అయితే ఈ తీర్మానంపై వెలుగు సీసీ సంతకాలు చేయాల్సి ఉందని సంతకాలు చేయకుండా స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడినని చెప్పుకునే ఓవ్యక్తి అడ్డు తగులుతున్నాడని ఆరోపించారు. మహిళలకు రుణాల మంజూరు విషయంలో రాజకీయ నాయకులు అడ్డు తగలడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై మండల గ్రీవెన్స్ సెల్‌లో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని దీంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. మహిళలకు రుణాలు చెల్లించకుండా అధికార పార్టీ రాజకీయ నాయకులకు వత్తాసు పలుకుతున్న వెలుగు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోక్సో చట్టంపై అవగాహన

గరుగుబిల్లి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో శనివారం ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి ఎస్.దామోదరరావు పాల్గొని, పోక్సోచట్టంతో పాటు గుడ్,బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులంతా ఒకరిపై మరొకరు అజమాయిషీ చెలాయించకూడదని, అందరూ సమానమేనన్న భావనతో మెలగాలని తెలిపారు. ప్రతిఒక్కరూ బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరావు, ఎస్ఐ ఫకృద్దీన్, ప్రిన్సిపాల్ రజని తదితరులు పాల్గొన్నారు.

భారత్‌పై అమెరికా టారిఫ్ లను రద్దు చేయాలి

- వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల డిమాండ్
- ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకోతో నిరసన



ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద రాస్తారోకోలో వామపక్ష నాయకులు

పార్వతీపురం టౌన్:

భారత్‌పై అమెరికా టారిఫ్‌లను రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శనివారం పార్వతీపురం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద రాస్తారోకోతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇతర దేశాల నుంచి తాము దిగుమతి చేసుకునే సరుకుల దిగుమతులపై పన్నులు తగ్గించాలని హుకుం జారీ చేశారని, చైనా, యూరోపియన్‌లతోపాటు చిన్న చిన్న దేశాలు కూడా ఏమిటీ దౌర్జన్యం అని ఎదురు తిరిగాయన్నారు. చైనా అమెరికాకు ఎదురు తిరిగి అమెరికా దిగుమతులపై పన్నులు పెంచిందని, భారత్ మాత్రం వాటికి భిన్నంగా అమెరికాపై పన్నుల రద్దు చేసిందని ఇది దేశ ప్రతిష్ఠకే అవమానకరమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, సీపీఐ జిల్లా నాయకులు ఆర్‌వీఎస్.కుమార్, ఎస్.దుర్గారావు, సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు పి.శ్రీనునాయుడు, భాస్కర రావు, సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా నాయకులు పి.సంగం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా నాయకులు పోల ఈశ్వరరావు, పోల రమణి, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ పాలక రంజిత్ కుమార్, సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, జిల్లా కార్యదర్శి బీవీ రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ పట్టణ నాయకులు బి.సూరిబాబు, రాగోలు సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

9న రెడ్‌రన్

పార్వతీపురంటౌన్: ఎయిడ్స్, హెచ్ఐవీపై అవగాహనలో భాగంగా ఈ నెల 9వ తేదీన 5 కి.మీ రెడ్ రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, హెచ్ఐవీ, టీబీ నియంత్రణ అధికారి డా. ఎం వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 9వ తేదీ ఉదయం 6 గంటలకు శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి రన్ ప్రారంభమవుతుందని, కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగుతుందని చెప్పారు.